వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం


కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి


హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

• మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరగడం, గెలుపోటములు సహజమేనని, ఓడిపోయినంత మాత్రాన అధైర్యపడొద్దని, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అన్ని విధాలా తాము అండగా ఉంటామని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశాన్ని మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఓటమిని గౌరవప్రదంగా స్వీకరిస్తామన్నారు. టీడీపీ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలన్నారు. ఎవరైనా గెలిచాక అందరికీ ఎమ్మెల్యేగానే వ్యవహరించాలన్నారు. ఇటీవల శంకర్‌నగరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం, వారిపైనే కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఇలాంటివి భవిష్యత్‌లో పునరావృతం కాకుండా టీడీపీ ప్రభుత్వం చూడాలన్నారు. 40 ఏళ్లుగా తమ కుటుంబం రాజకీయాల్లో కొనసాగుతోందన్నారు. తన తండ్రితో పాటు బాబాయిలు, సోదరుడు గౌతమ్‌రెడ్డి, తాను ప్రజలకు మేలు చేసే రీతిలోనే వ్యవహరిస్తున్నామన్నారు. గతంలో తన సోదరుడు మేకపాటి గౌతమ్‌రెడ్డిపై దాడి జరిగిందని, ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించి మంత్రి అయ్యారని, అధికారంలో ఉన్నా ఎలాంటి కక్ష సాధింపు రాజకీయాలు చేయలేదని గుర్తుచేశారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీలకు స్థలాలు ఇచ్చి ప్రోత్సహించిన ఘనత తమ కుటుంబానిదేనన్నారు. పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఎలాంటి కేసులనైనా ఎదుర్కొనేందుకు విశ్రాంత ఉద్యోగులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, అన్యాయాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆత్మకూరు అభివృద్ధికి సంబంధించి టీడీపీ ప్రభుత్వానికి తాము సహకరిస్తామన్నారు.

జగనన్న పట్టుదల కలిగిన వ్యక్తి

ఎన్నికల్లో ఓడినంత మాత్రాన పార్టీ అంతరించిపోలేదని, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదల కలిగిన వ్యక్తి అని, పడిన కెరటం తిరిగి లేస్తుందన్న చందాన పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తీసుకొచ్చే సత్తా ఆయనకు ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ కుటుంబంతో మేకపాటి కుటుంబానికి మంచి అనుబంధం ఉందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు విక్రమ్‌రెడ్డి అండగా ఉంటారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీన్ని ఏ మాత్రం సహించబోమన్నారు. దీనిపై జిల్లా నాయకత్వం సమష్టి కార్యాచరణను సిద్ధం చేసుకుని ఎవరికి ఎలాంటి అన్యాయం జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా పార్టీ కార్యాలయంలో న్యాయపరంగా అవసరమైన చర్యలు చేపడుతామన్నారు. పార్టీని తిరిగి బలోపేతం చేసేలా కార్యకర్తల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, యర్రబల్లి పెంచలయ్య, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సయ్యద్ జమీర్, బాలఅంకయ్య, కిషోర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కొండా స్వరూపరాణి, కామాక్షయ్య నాయుడు, పీ పెంచలయ్య, షేక్ ఖాదర్‌బాషా, ముజీబ్, పుచ్చలపల్లి రవీంద్రరెడ్డి, కలాం, కేతా రవి, సర్పంచ్‌లు శోభా, హాజరత్తమ్మ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సచివాలయాల్లో తనిఖీలు


కలిగిరి సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

కలిగిరి: మండలంలోని వెలగపాడు, కలిగిరి బిట్–1, 2 సచివాలయాలను ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల మృతి చెందిన 8వ వార్డుకు చెందిన బొజ్జా సుబ్బారెడ్డి, 11వ వార్డుకు చెందిన పాశం వెంకటేశ్వర్లు, 16వ వార్డుకు చెందిన మాలకొండయ్య, 18వ వార్డుకు చెందిన జగ్గయ్య, కోలా చిన్నపెంచలయ్య, 22వ వార్డుకు చెందిన మాలకొండయ్య కుటుంబాలకు అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, రామ్‌ప్రసాద్ రెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు



ఉదయగిరి: ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపో కండక్టర్ సయ్యద్ మౌలాలి ఉద్యోగ విరమణ సభను స్థానిక అల్‌ఖైర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు, బంధుమిత్రులు హాజరై మౌలాలిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మౌలాలి అంకితభావంతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల మన్ననలను పొందడంతో పాటు ఎన్నో అవార్డులు పొందారని కొనియాడారు. ఆయన శేషజీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు, స్థానిక ఉద్యోగులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్స్ స్కీం సహకారంతో హెచ్ఐవీపై బుధవారం అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, లింకు వర్కర్లకు హెచ్ఐవీపై వైద్యులు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు వివరాలు గోప్యంగా ఉంచి మందులు సైతం అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంపీహెచ్ఏ నాగశ్రీ, సీహెచ్ఓ సుగుణ, చైల్డ్ ఫండ్ ఇండియా ఆత్మకూరు క్లస్టర్ ఏఓ మహాలక్ష్మి, ఆశాకార్యకర్తలు శివపార్వతి, వరలక్ష్మి, 104 డీఈఓ బి వేణు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగునకు చర్యలు

సీతారామపురం: మండలంలోని నెమళ్లదిన్నె, బసినేనిపల్లి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా ఎంపికైన నెమళ్లదిన్నె, బసినేనిపల్లి గ్రామాల్లో అధికారుల బృందం బుధవారం పర్యటించింది. ప్రతి ఇంట్లో మరుగుదొడ్ల వినియోగం, పరిసరాల శుభ్రత, పారిశుధ్య మెరుగు, డ్రైనేజీల స్థితిగతులు, సంపద కేంద్రానికి చెత్త తరలింపు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల వినియోగం, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ మల్లికార్జున, పీఆర్ ఏఈ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓలు

ఉదయగిరి: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓలు షేక్ మస్తాన్ వలి, టీ శ్రీనివాసులు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను బుధవారం వారు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను తమ సొంతబిడ్డలుగా భావించి రుచిగా, శుచిగా వండి వడ్డించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పాఠశాలకు నూరు శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం బాలకేశవులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బిజ్జంపల్లె ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు ప్రారంభించారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి


సహకార బ్యాంకును ప్రారంభిస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి: రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో జలదంకిలో నూతనంగా ప్రారంభించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరారు. జలదంకిలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్ర సహకార బ్యాంకు శాఖను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార బ్యాంకు ద్వారా రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, గృహ రుణాలు, ఎస్ఓడీ రుణాలతో పాటు స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. చిరువ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలతో పాటు కార్లు, ద్విచక్ర వాహనాలకు కిసాన్ చక్ర రుణాలు, విద్యా రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సహకార బ్యాంకు సీఈఓ ఎస్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్లు సరిత, ఉషారాణి, మేనేజర్ నాగ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న బీటీఏ నేతలు

సోమశిల: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రొట్టె వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అనంతసాగరం మండలం రేవూరు, కొత్తపల్లి, అనంతసాగరం, చిలకలమర్రి, కామిరెడ్డిపాడు కాంప్లెక్స్‌ల పరిధిలో బీటీఏ సభ్యత్వ నమోదును బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై బీటీఏ అలుపెరగని పోరాటం సాగిస్తోందన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్, ఏపీజీఎల్ఐ బకాయిలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు. బీటీఏ రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఊట్ల రఘు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలయ్య, మురళి, ఎం ప్రసాద్, వెంకటరమణ, పెంచలయ్య, పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



నేను బడికిపోతాపై అవగాహన ర్యాలీ

అల్లూరు: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, సునీత పిలుపునిచ్చారు. నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా అల్లూరులోని ఎంపీయూపీ స్కూల్ (సుబ్బయ్య బడి) నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఐదేళ్లు నిండిన, బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి వారి ఉజ్వల భవితకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంపై దాడి

సోమశిల: మండలంలోని మినగల్లు గ్రామ సచివాలయ ఏఎన్ఎం అరుణమ్మ తనపై తన బావ ఉప్పు ఈశ్వరయ్య దాడికి పాల్పడ్డాడని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న తనపై తన బావ దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు వెంగమాంబ పదహారు రోజుల పండగ

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో వెలసియున్న వెంగమాంబ పేరంటాలు పదహారు రోజుల పండగను గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వెంగమాంబ దంపతులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వెంగమాంబ దంపతులు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

20న మండల సర్వసభ్య సమావేశం

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈ నెల 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు 13 వినతులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి 13 వినతులు అందాయని డిపో మేనేజర్ కరీమున్నీసా తెలిపారు. మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి, చుంచులూరు పరిసర గ్రామాల నుంచి వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు అనువుగా, అనుమసముద్రంపేట మండలం అబ్బాసాహెబ్‌పేటకు బస్సులు నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేసినట్లు ఆమె చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదించి వినతుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు రిజర్వేషన్ అమలు చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : చేనేత కార్మికులకు రిజర్వేషన్ సమగ్రంగా అమలు చేయాలని సీపీఐ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని సంతపేటలో ఉన్న సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందని, సరైన భృతిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేనేత కార్మికులకు ఉన్న 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి చేనేత కార్మికునికి 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. మూడు సెంట్ల స్థలంలో చేనేత కార్మికుడికి ఇంటిని, మగ్గాన్ని నిర్మించాలని కోరారు. 45 సంవత్సరాలకు పింఛన్ అందజేయాలని, ముద్ర రుణాల కింద జీఎస్టీ లేకుండా రూ.లక్ష రుణాలు ఇవ్వాలని, రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు, ఆప్కోకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, చేనేత వస్త్రాలకు జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమలను కుటీర పరిశ్రమలుగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు సమష్టి కృషి చేయాలని మహాసభ తీర్మానించిందని అన్నారు. సమావేశంలో సీపీఐ, ఏఐటీయూసీ, చేనేత కార్మిక సంఘం నాయకులు పమజుల దశరథరామయ్య, మాధవస్వామి, దామా అంకయ్య, రామరాజు, పార్థసారథి, శంకర్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి


సోమశిల: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు


ఉదయగిరిలో..


సీతారామపురం: వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సీతారామపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు కోడె రమణయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలోపేతం చేసి బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పుప్రకారం గ్రాట్యుటీని అమలు చేయాలని, కనీస వేతనాన్ని రూ.26 వేలు చేసి పెన్షన్, పీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలు షేక్ మెహబూబ్‌జానీ, ప్రవంతి, భవానీ, ఫరిహానా, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సంధానీబాషాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ అఖిల భారత కార్మికుల కోర్కెల దినోత్సవంలో భాగంగా అంగన్‌వాడీల సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నాయబ్, అంగన్‌వాడీలు ప్రమీల, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల : అనంతసాగరం మండలంలోని అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేసి సాధించుకున్న జీఓలను అమలు చేయాలని, జూలై నుంచి జీతాలు పెంచి ఇవ్వాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ చట్టాలు కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు సునీత, నూర్జహాన్, సుబ్బమ్మ, జ్యోతి, అరుణ, ఆదిలక్ష్మి, పర్వీన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడికి వైద్యసిబ్బంది ఆర్థిక సాయం


బాధితుడి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న వైద్యాధికారిణి

ఉదయగిరి: పట్టణంలోని ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యానికి గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి శివకల్పన బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. సుబ్రహ్మణ్యం తీవ్ర అనారోగ్యంతో మంచానికి పరిమితమై ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న వైద్యాధికారిణి తనతో పాటు సీహెచ్ఓ శివకుమారి, ఏఎన్ఎంల సహకారంతో రూ.10వేలు నగదును సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు అందజేశారు. సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దీంతో సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


గర్భిణులకు మందులు అందజేస్తున్న దాతలు

కావలి : గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు.పట్టణంలోని రాజీవ్‌నగర్ పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు వైద్యులు ద్వారకానాథ్‌చౌదరి, లక్ష్మి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని తెలిపారు. తద్వారా మాతాశిశు మరణాలను నివారించవచ్చన్నారు. డాక్టర్ రామ్ సెంటర్, విశ్వోదయ సహకారంతో ఐరన్ సిరప్‌లు, కాల్షియం, విటమిన్ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి , కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ గాయత్రీదేవి

వింజమూరు(ఉదయగిరి): జాతీయ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున అర్హత ఉన్న చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఉపాధి ఏపీడీ రాళ్లపల్లి గాయత్రిదేవి సూచించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఉపాధి ఏపీఓలు, ఈసీలు, టీఏలు, బీఎఫ్‌టీలతో సమావేశాన్ని వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఉదయగిరి క్లస్టర్ పరిధిలో 1450 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 349 ఎకరాలు గర్తించామని, 165 ఎకరాలకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే అవెన్యూ ప్లాంటేషన్ 40, బ్లాక్ ప్లాంటేషన్ 9, బండ్ ప్లాంటేషన్ 60, పూతోటలు 6, మల్బరీ 5 ఎకరాల్లో పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. లక్ష్యాల సాధనకు అందరూ సమష్టిగా పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉదయగిరి, వింజమూరు ఉద్యాన అధికారులు జయశ్రీ, షాహిల్, ఎంపీడీఓ కిరణ్‌కుమార్, క్లస్టర్ టీఏ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ


బహిరంగ విచారణ జరుపుతున్న అధికారులు

అనుమసముద్రంపేట: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ బహిరంగ సభను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండలంలో 975 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి కూలీల వేతనాల కోసం రూ.8 కోట్లు, మెటీరియల్‌కు సంబంధించి రూ.5 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. కూలీలందరికి పని కల్పించడంతో పాటు గిట్టుబాటు కూలి అందేలా చూడాలన్నారు. ఈ తనిఖీల్లో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని పలు దాబాలు, హోటళ్లలో ఆహార భద్రతాధికారిణి నీరజ, నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడి పరిస్థితులను చూసి నివ్వెరపోయారు. అపరిశుభ్ర వాతావరణం, ఆహారంలో నాణ్యత లేకపోవడం, నిల్వ ఆహార పదార్థాలు, చికెన్‌లో నిషేధిత రంగులు కలిపి ఉండటం గమనించారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ పట్టణంలోని పలు దాబాలు, హోటళ్లను తనిఖీ చేసి యజమానులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అధిక శాతం హోటళ్లు, దాబాలకు కనీసం లైసెన్సులు కూడా లేవన్నారు. కల్తీ ఆహారం అందించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడటం సరికాదన్నారు. వారం రోజుల్లోపు అన్ని అనుమతులు తీసుకుని హోటళ్లను నడపాలని సూచించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.